# ప్రజాశక్తి

గురువారం 24 ఆగస్టు 2023

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి



హర్షం వ్యక్తంచేస్తున్న పాఠశాల విద్యార్థులు

# చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం



జాతీయ జెండాలతో సంబరాలు జరుపుతున్న విశాఖ ప్రజలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల విశాఖలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జాతీయ జెండాలను ఊపుతూ నగరంలో సంబరాలు చేసుకున్నారు. పలు పాఠశాలల వద్ద విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. చంద్రుడి దక్షిణ ధ్రువం మీద అడుగు పెట్టేందుకు ప్రపంచంలోని అనేక దేశాలు ప్రయత్నించినా సాధించలేని విజయాన్ని భారత శాస్త్రవేత్తలు సాధించి సరికొత్త అధ్యాయానికి తెర తీశారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఇస్రో శాస్త్రవేత్తలు పెద్ద లక్ష్యాన్ని సాధించారని అభినందించారు. ఇది భారతీయులందరి విజయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు చేసి, విజయం సాధించి ప్రపంచ దేశాల్లో భారతదేశం అగ్రస్థానంలో నిలవాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

జయహో భారత్ వార్త 4లో

# మారిటైం రంగం అభివృద్ధితో సుస్థిరత

## నౌకాయాన రంగ అవకాశాలను ఉపయోగించుకోవాలి : మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న వైజాగ్ పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మారిటైం రంగంతోనే ఆర్థిక వ్యవస్థ సుస్థిరత సాధిస్తుందని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఈ ఏడాది అక్టోబర్ 17 నుంచి 19వ తేదీ వరకూ న్యూ ఢిల్లీలో కేంద్ర పోర్టులు నౌకాయాన జలరవాణా మంత్రిత్వ శాఖ అధ్వర్యాన నిర్వహించనున్న గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ 2023ను పురస్కరించుకుని విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యాన నగరంలోని నోవాటెల్‌హోటల్‌లో బుధవారం రోడ్ షోను నిర్వహించారు. ఈ సందర్భంగా వైజాగ్ పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం వల్ల సముద్రయాన రంగం సుస్థిరత వైపు అడుగులు వేస్తుందని, నౌకాయాన అభివృద్ధి, పురోగతికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఢిల్లీలో జరిగే సమ్మిట్‌కు ఎపి ప్రభుత్వంతో పాటు నౌకాయాన రంగంలో ఉన్న పారిశ్రామిక వేత్తలు పాలుపంచుకోవాలని కోరారు.

కేంద్ర పోర్టులు, నౌకాయాన జలరవాణా శాఖా మంత్రి శర్బానంద సోనోవాల్ వీడియో సందేశాన్ని అందజేశారు. భారత దేశం బ్లూ ఎకానమీ దిశగా అడుగులు వేస్తోందని, ఈ సమ్మిట్ అందులో ఒక మైలురాయి అని తన సందేశంలో పేర్కొన్నారు. సముద్రయాన రంగంలో వృద్ధిని సాధించడంతో పాటు కనెక్టివిటీని పెంచే ప్రాముఖ్యతను గుర్తించి భారత, అంతర్జాతీయ సముద్ర యాన రంగానికి అనుసంధానంగా ఉపయోగపడేలా సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అత్మనిర్భర్ భారత్ మిషన్‌లో భాగంగా సముద్రయాన రంగంలో పెట్టుబడులను నిర్వహించేందుకు ప్రపంచ వ్యాప్తంగా స్థానిక సహకారాన్ని పెంపొందించడం ఈ సమ్మిట్ ఉద్దేశమని పేర్కొన్నారు. పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వే మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శంతను ఠాకూర్ వీడియో సందేశాన్ని ఇచ్చారు. భారత్‌లో సముద్రయాన రంగం అత్యంత పురాతనమైనదని, ఎంతో అభివృద్ధిని సాధించిందని చెప్పారు. అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ పాత్రను బలోపేతం చేసేందుకు సమ్మిట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమ్మిట్ ప్రయోజనాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సాగర్‌మాల జాయింట్ సెక్రెటరీ భూషణ్‌కుమార్ వివరించారు. బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు మాట్లాడుతూ, విశాఖపట్నం పోర్టు అధారిటీ, కేంద్ర పర్యావరణ శాఖలు సంయుక్తంగా క్రూయిజ్ టెర్మినల్‌ను నిర్మించడం భవిష్యత్తులో నౌకాయాన రంగంలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టేదిగా ఉందన్నారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పోర్టుల నిర్మాణం గురించి వివరించారు. ఈ రంగంలో ఉన్న అవకాశాలను

మిగతా 2లో..

## మాజీ సైనికునిపై గూండాల దాడి - వైసిపి నాయకుని హస్తం?

వార్త మెయిన్ 3లో..

## ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు : జాయింట్ కలెక్టర్

వార్త 2లో..

## కేంద్ర ఉక్కు కార్యదర్శి సందర్శన ఆంతర్యమేమిటో వెల్లడించాలి

వార్త 2లో..



బిఎన్ఆర్.నగర్ వార్షికోత్సవంలో పాల్గొన్న సిపిఎం నాయకులు లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

## పోరాటాలతోనే ఏదైనా సాధ్యం

బిఎన్ఆర్.నగర్ వార్షికోత్సవంలో సిపిఎం వార్త 3లో..

# భూ కబ్జాలంటూ దుష్ప్రచారం

## ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో భూ కబ్జాలు జరిగిపోతున్నాయని, ప్రతి సమస్యకూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లింకు పెట్టి కొన్ని పత్రికలు, పార్టీలు దుష్ప్రచారం సాగిస్తున్నాయని ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి ఆరోపించారు. ప్రజల కోసం తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పథకాలను ఎంత బాధ్యతగా చేపడుతుందో రాష్ట్ర ఆర్థిక ప్రగతి లెక్కలే తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. బుధవారం ఉదయం గ్రాండ్‌బే హోటల్‌లో మీడియా ఇంటరాక్షన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

### రుషికొండ కాదు కొంచెం పక్కకు చూడవయ్యా పవన్

టూరిజం ప్రాజెక్టుల్లో భాగంగా అన్ని అనుమతులూ తీసుకునే ప్రభుత్వం రుషికొండపై కొత్తగా హోటళ్లు, రిసార్టులు, ఇతర భవనాలు నిర్మిస్తుందని సుబ్బారెడ్డి వివరించారు. పవన్ కల్యాణ్ తాజా పర్యటనపై ఆయన స్పందిస్తూ... 'రుషికొండను కాదు కాస్త పక్కకు చూడవయ్యా? గీతం కాలేజీ 25ఎకరాలు ప్రభుత్వ భూమిని కబ్జా చేసేసి భవనాలు నిర్మించుకుంది" అంటూ వ్యాఖ్యానించారు. చంద్రబాబు హయాంలో సిఐఐ సదస్సులు జరిగినా ఒక్క పైసా కూడా విశాఖ, ఆంధ్రప్రదేశ్‌కు రాని విషయాన్ని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుల్లో రూ.13లక్షల కోట్ల ఒప్పందాలు అన్నీ కార్యరూపం దాల్చుతున్నాయని వివరించారు.

### పలు సమస్యలపై స్పందిస్తూ...

మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకూ సుబ్బారెడ్డి సమాధానాలు చెప్పారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగకపోవడంతో కార్మికులు, విశాఖ ప్రజల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతూ ఉందని ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరగా వైసిపి సర్కారు ప్రయివేటీకరణకు వ్యతిరేకమని, తగిన కార్యాచరణ చేపడతామని చెప్పారు. గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న పోరాటంపై సుబ్బారెడ్డి స్పందిస్తూ యాజమాన్యం కొన్ని సమస్యలను తీర్చేందుకు అంగీకరించిందని, అన్ని సమస్యలూ ఒకేసారి పరిష్కారం కావని కొంత సమయం తీసుకుంటారని తెలిపారని, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

## మారిటైం రంగం అభివృద్ధితో సుస్థిరత

నౌకాయాన రంగంలోని పారిశ్రామిక వేత్తలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ, పోర్టుల అభివృద్ధికి ఏపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో నాలుగు పోర్టులను శీఘ్రగతిన అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే, స్టేక్ హోల్డర్స్, పోర్టు భాగస్వామ్య వ్యాపారులు పాల్గొన్నారు. గ్లోబల్ మారిటైమ్ ఇండియా సమ్మిట్ 2023, పూర్తి ఎజెండా, రిజిస్ట్రేషన్ వివరాలతో www.maritimeindia-summit.com అధికారిక వెబ్‌సైట్‌ను పోర్టు అధికారులు విడుదల చేశారు.

## భూకబ్జాలంటూ దుష్ప్రచారం

జోక్యం చేసుకుంటున్నారని చెప్పారు. వైసిపి ముఖ్యనేత తర్లువాడ కొండపై ఇటీవల పర్యటించారని, కూతురిచే కాలేజీ నిర్మాణం చేస్తారని తెలిసిందని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'నేను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడాను. ఆక్రమణ అనేది లేదని, అలాగని ఎలాంటి ప్రతిపాదనా లేదని చెప్పారని' సుబ్బారెడ్డి బదులిచ్చారు. ఆగనంపూడి టోల్‌గేట్ వ్యవహారం తాజాగా ప్రభుత్వ దృష్టికి వచ్చిందని, వారు కోర్టుకెళ్లడం వల్ల ప్రభుత్వం వేచిచూస్తోందని, త్వరలోనే దీన్ని అక్కడ నుంచి వెకేట్ చేసేలాగ సమస్యను పరిష్కరిస్తామని సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, బ్రాహ్మణకార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక చికిత్సాలయం నుంచి మహిళ అదృశ్యం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రభుత్వ మానసిక చికిత్సాలయం నుంచి ఒడిశాకు చెందిన మహిళ తప్పిపోయినట్లుగా మూడవ పట్టణ పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా, బోలసార గ్రామానికి చెందిన రశ్మిత దలై(33) మానసిక పరిస్థితి బాగోలేక ఈ నెల 10వ తేదీన పెదవాల్తేరులోని మానసిక ఆసుపత్రిలో కుటుంబీకులు చికిత్స నిమిత్తం చేర్పించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి కనబడుట లేదని భర్త సంతోష్ దలాయి మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సిఐ కోరాడ రామారావు పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ వి.చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

## డీజిల్ లోకోషెడ్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ విశాఖపట్నంలోని డీజిల్ లోకోషెడ్‌ను బుధవారం తనిఖీ చేశారు. లోకో షెడ్‌లోని పలు సౌకర్యాలను, బ్రీదర్ వాల్స్, వీల్ వైడనింగ్ తదితరాలకు సవరణలు చేసిన వీల్ చేంజ్ సెక్షన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం పవర్ అసెంబ్లీ బెంచ్‌ను డీజిల్ లోకోస్ క్లచ్ ఓవర్‌హాలింగ్ మోటార్ బెంచ్ విభాగం మెటలర్జికల్ లేబొరేటరీని పరిశీలించారు. న్యూ షెడ్‌లోని ఐసోలేషన్ విధానంపై ఆరా తీశారు. షెడ్డు వద్ద అండర్ గేర్ మెయింటెనెన్స్ డిపో, లోకోలను డిఆర్ఎం పరిశీలించి అభివృద్ధి కార్యక్రమాల పనితీరుపై సమీక్షించారు. డీజిల్ లోకో షెడ్ అధికారులు షెడ్‌లో నిర్వహిస్తున్న పలుఅంశాలు, ఆధునీకరణ పనులపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

## మరో దోపిడీకి వైసిపి బరి తెగింపు : పల్లా

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ) : విశాఖ నగర పరిధిలో వేల కోట్ల విలువైన మరో భూదోపిడీకి అధికార వైసిపి నాయకులు పూనుకున్నారని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తర్లువాడ గ్రామంలో అంతర్జాతీయ ప్రమాణాలతో విశ్వవిద్యాలయం నిర్మిస్తామని, ప్రభుత్వ భూమిని వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆధ్యాత్మిక చరిత్ర ఉన్న తర్లువాడ కొండను ఎకరా రూ.17 లక్షలు చొప్పున కారుచౌకగా విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆర్థిక నేరగాళ్లు విశ్వవిద్యాలయం పెడతామంటే విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తర్లువాడ కొండను దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో మహ్మద్ నజీర్, పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు సీతంరాజు సాయం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : జివిఎంసి 29వ వార్డు పరిధిలో ఉన్న రెండు నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ సాయం అందించారు. కృష్ణానగర్ ఏరియాలో నివాసముంటున్న కీర్తిశేషులు లెక్కల దాలినాయుడు కుటుంబానికి 2 నెలల పోషకాహారంతోపాటు, ఆర్థిక సహాయాన్ని స్థానిక కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు నేతృత్వంలో అందించారు. వెంకటపతిరాజునగర్‌లో నివాసముంటున్న సింగంపల్లి శివకుమార్ (ఫుట్ బాల్ ఆటగాడు) రెండు కిడ్నీలు ఫెయిల్ అయిన కారణంగా కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉందని తెలుసుకొని 2 నెలల పోషకాహారంతో పాటు, ఆర్థిక సహాయం చేశారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం : గండి బాబ్జీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : ప్రజా సంక్షేమమే చంద్రబాబు ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. 42వ వార్డులో బుధవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్థితిగతులు మారాలని మహాశక్తి కార్యక్రమం రూపకల్పన చేశారన్నారు.

# కేంద్ర ఉక్కు కార్యదర్శి సందర్శన ఆంతర్యమేమిటో వెల్లడించాలి

### సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాలను పరిశీలించి, అధికారులతో చర్చించారని, అయితే సంస్థలో కీలకమైన సమస్యలపై ఆయన స్పందించలేదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 7.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంటులో రెండు బ్లాస్ట్‌ఫర్నేష్‌లు మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. సంస్థకు ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం కావాలనే సంస్థను పూర్తిసామర్థ్యంతో నడవనివ్వడంలేదని, సంస్థను నష్టాల్లోకి నెట్టి ఆర్థికంగా దెబ్బతీస్తోందని వివరించారు. సంస్థలో ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయడంలేదని, ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ఆఫీసర్లకు ప్రమోషన్లు, 8500 మంది ఉక్కు నిర్వాసితులకు ఉద్యోగాలు, ప్లాంటుకు సొంత గనులు ఇవ్వడంలేదని తెలిపారు. 923 రోజుల నుంచి పోరాటం జరుగుతున్న సమయంలో ఉక్కు కార్యదర్శి వస్తున్నారంటే ప్రధాన సమస్యలపై సానుకూల ప్రకటన ప్రభుత్వం నుండి వస్తుందని కార్మికులు ఆశించారని, కానీ, ఫలితం లేకుండాపోయిందని పేర్కొన్నారు. సంస్థలో పర్యటన, అధికారులతో సమావేశం మినహా సమస్యలు పరిష్కారానికి కీలక ప్రకటనలేమీ చేయలేదని తెలిపారు. మరి ఈయన పర్యటనలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వీటికి కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్లాంటులోని ప్రధాన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిపిఎం చేపడుతు డిమాండ్ చేశారు. ప్లాంటును అమ్మాలన్న నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్మికుల పోరాటానికి మద్దతుగా సిపిఎం ఇప్పటికే వివిధ రూపాల్లో ఆందోళన చేస్తోందని, సెప్టెంబర్‌లో మరో కార్యాచరణ చేపడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తన ప్రజాద్రోహ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

# గంజాయి అరికట్టాలి : కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : జిల్లాలో గంజాయి లభించకుండా గట్టి చర్యలకు చేపట్టాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బోర్డు అధికారులకు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. ఈ విషయంపై కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కాలేజీలు,స్కూళ్లలో కమిటీలను ఏర్పాటుచేసి డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించాలన్నారు. ఆ కమిటీలలో శిక్షణ పొందిన ఎన్‌జిఒల ప్రతినిధులను మెంబర్లుగా ఉంచి వారి సేవలను వినియోగించు కోవాలన్నారు. డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడ్డ వ్యక్తులకు డి- అడిక్షన్ కేంద్రాలలో చేర్పించి, వారిని వాటి నుంచి దూరం చేయడానికి కృషి చేయాలన్నారు.

జిల్లాలో గంజాయి రవాణా కాకుండా అన్ని మార్గాలలో అవసరమైన స్థాయిలో నిఘా పెంచాలన్నారు. ఆన్ లైన్ మార్కెటింగ్ ద్వారా వీటి రవాణా అరిక ట్టడానికి అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. షిపింగ్ బోట్స్ ద్వారా రవాణా అరికట్టడానికి మైరైన్ పోలీస్, ఫిషరీస్ శాఖలతో చర్చించి వారి సహకాన్ని పొందాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఇబి, అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు, ఎడిసిపి క్రైమ్ డి.గంగాధరం, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డిఇఒ చంద్రకళ, ఎడి (డ్రగ్ కంట్రోల్) కెజిహెచ్ సైకియాట్రి నిపుణులు, డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే సహించం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేస్తే సహించేది లేదని, దీనిని రక్షించుకునేందుకు చేపట్టిన ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు విల్లా రామ్మోహన్ కుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 873వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకోవడంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి బాధ్యత ఉంటుందన్నారు. అధికారంలో ఉన్న పాలకులు స్టీల్‌ప్లాంట్ రక్షణ విషయంలో ఆశించిన స్థాయిలో, కృషి చేయటం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకోవాలని, అవసరమైతే అన్ని పార్టీలు, కార్మిక సంఘాల నాయకులతో కేంద్రం వద్దకు వెళ్లాలని కోరారు. ఈ దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు ఉప్పిలి రామకృష్ణ, విహెచ్.కన్నారావు, దేవర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : జిల్లాలో ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో ప్యాడి ప్రొక్యూర్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం ఉత్పత్తి ఏ స్థాయిలో జరుగుతుందో అంచనా వేసి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇ-క్రాప్ బుకింగ్, ఇ-కెవైసి తప్పనిసరిగా చేయాలని సూచించారు. దీనికి సంబంధించి డైలీ రిపోర్ట్ తనకు అందజేయాలన్నారు. క్లస్టర్ ఆర్‌బికెలలో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సహాయకుల నియామకం చేపట్టాలన్నారు. జిల్లాలో గన్నీ బ్యాగులు ఏ మేరకు అవసరం అవుతాయో గుర్తించి నిల్వ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా పౌర సరఫరాల అధికారి జి సూర్యప్రకాశరావు, డిస్ట్రిక్ మేనేజర్ సివిల్ సప్లైస్ ఐ.రాజేశ్వరి, జిల్లా రవాణా అధారిటీ ఎం.బుచ్చిరాజు, జిల్లా సహకార అధికారి పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# టాటా గ్రూప్ అంబులెన్స్ వితరణ

### కెజిహెచ్‌కు మేయర్ అందజేత

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : టాటా గ్రూప్ అందించిన అత్యంత ఆధునికరమైన అంబులెన్స్‌ను కింగ్ జార్జ్ హాస్పిటల్ (కెజిహెచ్)కు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి బుధవారం అందించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో టాటా గ్రూప్ ప్రతినిధులతో విపత్తుల నివారణపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, విపత్తుల సమయంలో నివారణ కార్యక్రమంలో పౌరులను భాగస్వామ్యం చేసేందుకు జివిఎంసి, ఎస్ఆర్‌యు సంయుక్తంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ ఆధారిత విపత్తుల ప్రమాద నిర్వహణ కార్యక్రమంలో భాగంగా టాటా గ్రూప్ అత్యంత ఆధునికరమైన అంబులెన్స్ అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, టాటా గ్రూప్ ప్రతినిధులు శ్రీరంగ్, ఈప్సిత దాస్, విజయ్, ఎన్జీవోస్, కమ్యూనిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ : పురంధేశ్వరి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ అప్పుల ఊబిలో కూరుకుపోతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురంధేశ్వరి పేర్కొన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం జరిగిన బిజెపి రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి హయాంలో రూ.3.74 లక్షల కోట్ల అప్పులుంటే వైసిపి ప్రభుత్వం వచ్చాక రూ.7.44 లక్షల కోట్లకు చేరిందని ఆరోపించారు. పంచాయతీల్లో గ్రామ సభ ఆమోదం లేకుండా 70 శాతం విద్యుత్ బిల్లుల కింద ప్రభుత్వం మినహాయింపు అన్యాయం అన్నారు. నిధులు లేక వైసిపి సర్పంచులు కూడా బహిరంగంగా నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

## మత్స్యకార మహాసభ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఫిషింగ్ హార్బర్ వద్ద ఈ నెల 31న జరగనున్న 'మత్స్యకార మహాసభ - భవిష్యత్తుకు భరోసా' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి బుధవారం గవర్నర్ బంగ్లాలో ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి, మత్స్య పరిశ్రమ అభివృద్ధికి చేస్తున్న కృషిని, భవిష్యత్తులో మత్స్యకారులకు చేయాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి సమావేశంలో చర్చిస్తారని మత్స్యకార నాయకుడు వాసుపల్లి జానకిరామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ.రెహమాన్, బోటు యజమానులు దూడ పోలయ్య, వాసుపల్లి బ్రహ్మరాజు, గనగళ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పౌరగ్రంథాలయంలో భోజనశాల

**ప్రజాశక్తి-సీతమ్మధార :** పౌర గ్రంథాలయంలో ఆంధ్ర పెట్రో కెమికల్స్ ఆర్థికసాయంతో నూతనంగా నిర్మించిన భోజనశాలను ఆ సంస్థ డైరెక్టర్ ఎంఎస్ఆర్‌వికె. రంగారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాలకవర్గం అధ్యక్షులు డాక్టర్ ఎస్.విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు చదువుకోవడానికి గ్రంథాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, వాటిని సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగావకాశాలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రంథాలయ పాలకమండలి సభ్యులను అభినందించారు. ఈసందర్భంగా భోజనశాల, ఇతర నిర్మాణాలకు నిధులు సమకూర్చిన ఆంధ్రా పెట్రో కెమికల్స్‌కు డిఎస్.వర్మ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ పి.ప్రసన్నకుమార్,డాక్టర్ డివి సూర్యారావు గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి జనసేన సిద్ధాంతాలు




మాట్లాడుతున్న శివశంకర్.

**ప్రజాశక్తి- గాజువాక :** జనసేన సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జనసేన సీనియర నాయకులు టి శివ శంకర్ అన్నారు. బుధవారం గాజువాక ప్రైవేట్ కల్యాణ మండపంలో ఇటీవల జనసేనలో చేరిన గంధం వెంకటరావు అభినందన సభలో మాట్లాడుతూ, అధినేత పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి ఇప్పటికే అధికార ప్రతిపక్ష పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు ముఖ్యంగా యువత మహిళలు అధిక సంఖ్యలో పార్టీలో చేరుతున్నారన్నారు.కార్మిక నాయకుడిగా, వివాద రహితుడిగా 37 ఏళ్లపాటుకార్మికులకు సేవ అందించిన గంధం వెంకటరావు జనసేన పార్టీలో చేరడం శుభ పరిణామమన్నారు. కొన తాతారావు మాట్లాడుతూ వారాహి యాత్రలో కార్మిక నాయకుడు గంధం వెంకటరావు పార్టీ అధినేత సమక్షంలో జనసేనలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

బోలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గంధం వెంకటరావు చేరికతో గాజువాక నియోజకవర్గంలో జనసేన పార్టీలో నూతన ఉత్తేజం వచ్చిందన్నారు గంధం వెంకటరావు మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కషి చేస్తానన్నారు. తిప్పల రమణారెడ్డి, విందుల వెంకటరమణ, కరణం కనకరావు, ముమ్మన మురళి, లంకలత, లంకల మురళీదేవి, జ్యోతి రెడ్డి, ఆర్మీ గోవింద్, ప్రముఖ న్యాయవాది కళావతి, పశ్చిమ నియోజకవర్గ సీనియర్ నాయకులు పీలా రామకృష్ణ, త్రినాథ్, సుంకర వెంకటేశ్వరావు, సోమ శేఖర్, నరసింహామూర్తి, కదా శ్రీను పాల్గొన్నారు.

# పోరాటాలతోనే ఏదైనా సాధ్యం

### బిఎన్ఆర్ నగర్ వార్షికోత్సవంతో సిపిఎం నేతలు




మాట్లాడుతున్న సిపిఎం నేత లోకనాథం

**ప్రజాశక్తి - ఆరిలోవ :** ఐక్యంగా పోరాడితే ఏదైనా సాధించుకోవచ్చుని, ఎక్కువ మంది పేదలు నివాసముండే ఆరిలోవ ప్రాంతంలో పలు కాలనీలు ఇలా సాధించుకున్నవేనని సిపిఎం నేతలు స్పష్టం చేశారు. బుధవారం 10వ వార్డు బిఎన్ఆర్‌నగర్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిపిఎం ఆరిలోవ జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పి.మణి పాల్గొన్నారు. ముందుగా మాజీ కార్పొరేటర్ బొట్టా నర్సింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ఆరిలోవ ప్రాంతంలో పేదలకు ఇళ్ల కోసం సిపిఎం చేపట్టిన నిస్వార్ధ పోరాటాలతో అనేక కాలనీలు ఏర్పడ్డాయన్నారు.. ఆరిలోవ ప్రాంతం అభివృద్ధిలో సిపిఎం పాత్ర ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పి.మణి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగానే బిఎన్ఆర్ నగర్‌ను సాధించుకున్నామన్నారు. దీని వెనుక ఎంతో కష్టం, త్యాగాలు ఉన్నాయన్నారు. ఏ అధికారబలం లేకుండా ఆరిలోవ ప్రాంతంలో ఎన్నో కాలనీలు సాధించుకున్నామని, పోరాటాలతో ఏదైనా సాధించుకోవచ్చునేందుకు బిఎన్ఆర్ నగర్ ఏర్పాటే నిదర్శనమన్నారు. విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరల పెంపునకు వ్యతిరేకంగా సెప్టెంబరు 1, 4న నిర్వహించబోయే ధర్నాల్లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంతక ముందు ప్రజా నాట్యమండలి సభ్యులు వై.అప్పారావు, చంటి, నాగేశ్వరరావు, ఎం.వి.రమణ, కె.సన్యాసమ్మ, సత్య పాడిన విప్లవ గీతాలు, చిన్నారులు వేసిన నాటికలు అందరిని ఆకట్టుకుని, ఆలోచింప చేసాయి. కార్యక్రమంలో సిపిఎం, ఐద్వా నాయకులు ఎస్.రంగమ్మ, బి.సూర్యమణి, గౌరీ, గ్రామ సంఘం నాయకులు నగేష్, సంగీతరావు, రమణ, నాగరాజు పాల్గొన్నారు.

## సమాజానికి సేవలందించాలి

**ప్రజాశక్తి- భీమునిపట్నం :** ఉపాధ్యాయ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు సమాజంలో మెరుగైన సేవలు అందించాలని స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ ఎల్ సుధాకర్ ఛాత్రోపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డైట్‌లో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న 2021-23 బ్యాచ్ చాత్రోపాధ్యాయులకు ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుధాకర్ మాట్లాడుతూ, ఇక్కడ చదివిన విద్యార్థులు ఎంతోమంది వివిధ స్థాయిల్లో ఉన్నత స్థానాలు పొందారన్నారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో రాణించి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను చాత్రోపాధ్యాయులు సత్కరించారు. వైస్ ప్రిన్సిపల్ జి రవి, అధ్యాపకులు ఎం మహాలక్ష్మి, పి హరిణి, సిఎ సోమయాజులు, జె మాధవి, ఎస్ త్రినాథరావు పాల్గొన్నారు

## సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి నాల్గో వార్డు నేరెళ్లవలస హౌసింగ్ కాలనీలో రూ.12 లక్షలతో నిర్మించనున్న మూడు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జగన్నాథ అప్పారావు, జె శ్రీనివాసరెడ్డి, నాయుడు, రాజు, దాసు పాల్గొన్నారు

## 206 మందికి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి- భీమునిపట్నం :** స్థానిక ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో బుధ వారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ప్రసన్న, సాయి, తరుణ్ పాల్గొని, 206 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ టీమ్ ఇన్‌ఛార్జి వి కిరణ్‌కుమార్, సిబ్బంది సేవలు అందించారు. ఎస్ఓఎస్ ఆర్గనైజేషన్ మేనేజర్ కె దుర్గరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు వి సత్యనారాయణ, అనన్య దాసు, యానిమేటర్లు ఎల్ సరళ, బి అప్పలకొండ, కాకాస వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

## వెంపాడకు ఘన సత్కారం

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా జిల్లా నవచైతన్య కళా నాట్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఉత్తరాంధ్ర కళాకారుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తగరపువలసకు చెందిన సోషల్ వర్కర్ వెంపాడ శ్రీనివాసరెడ్డిని పలువురు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జిఎస్ఎన్ రాజు, సంఘం గౌరవ సలహాదారులు పిల్లి వీర్రాజు, సరగడ చిన్నరెడ్డి, తదితరులు శ్రీనివాసరెడ్డిని సత్కరించారు

## రికార్డు స్థాయిలో అప్పన్న హుండీ ఆదాయం

**ప్రజాశక్తి- సింహాచలం:** సింహాద్రి అప్పన్నకు భక్తులు 16 రోజుల్లో హుండీల ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం దేవస్థానం ఇఒ వి.త్రినాధరావు సమక్షంలో లెక్కించారు. రికార్డుస్థాయిలో రూ1,79,27020 నగదు, 79. 980 గ్రాముల బంగారం, 10.100 కిలోల వెండితోపాటు విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సింహాద్రి అప్పన్న హుండీలో అజ్ఞాత భక్తుడు రూ.వంద కోట్ల చెక్‌ను వేశాడు. కానీ అది చెల్లుతుందో, లేదోనని ఆలయ అధికారులు అంటున్నారు.

## చుక్కకొండ జోలికొస్తే చూస్తూ ఊరుకోం

**ప్రజాశక్తి -ఆనందపురం:** పురాతన చరిత్ర కలిగి,ఎంతో పవిత్రమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి పాదాలున్న తర్లువాడలోని చుక్కకొండను కాజేయాలని, లేకుంటే కబ్జా చేయాలని చూస్తే ఊరుకోబోమని జనసేన నేతలు హెచ్చరించారు. బుధవారం భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల ఆధ్వర్యంలో పలువురు రాష్ట్ర, జిల్లాస్థాయి జనసేన నాయకులు చుక్కకొండను పరిశీలించారు. తర్లువాడలో సర్వే నెంబరు ఒకటిలో చుక్కకొండపై ఉన్న భూములను ఎంపి విజయసాయిరెడ్డి వారి కుమార్తె నేహారెడ్డి పేరిట ఇంటర్నేషనల్ విద్యాసంస్థలు ఏర్పాటుకు లీజుకు ఇవ్వాలని చూస్తే ఊరుకోబోమన్నారు. మార్కెట్‌లో ఎకరా రూ.మూడు కోట్లు విలువతో రూ.360 కోట్ల విలువైన 120 ఎకరాల భూములను, కబ్జా చేయకుండానే కారుచౌకగా ఎకరా రూ.17లక్షలకు కాజేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. వైసిపి నేతల భూకబ్జాలు, అక్రమాలకు అంతూపొంతు లేకుండా ఉందని, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అసమర్థత వల్లే చుక్కకొండను కూడా కాజేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన నేతలు పిఎసి మెంబర్ కోన తాతారావు, ప్రధాన కార్యదర్శి శివ శంకర్, బొలిశెట్టి సత్య, పంచకర్ల రమేష్, సుందరపు విజయ్, పసుపులేటి ఉషాకిరణ్, గడసాల అప్పారావు,సంకు వేంకటేశ్వరరావు , కార్పొరేటర్ వసంత లక్ష్మి , పీలా రామకృష్ణ, తిప్పల రమణారెడ్డి ఉన్నారు.

## 24వ వార్డులో గడపగడపకూ...

**ప్రజాశక్తి- సీతమ్మధార :** 24వ వార్డు, గాంధీనగర్-2, సీతమ్మధార టిపిటి కాలనీ ప్రాంతాల్లో స్థానిక వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ ఫథకాలను వివరిస్తూ, - ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. . కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, బోగవల్లి గోవింద్, హరిపట్నాయక్, కె.చిన్నా, నేపాల్ శ్రీను, జివిఎంసి అధికారులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై

## సమగ్ర దర్యాప్తు జరపాలి : సిపిఐ




అన్యాక్రాంతమైన భూమి పరిశీలనలో సిపిఐ నేతలు

**ప్రజాశక్తి -మధురవాడ :** విశాఖపట్నం రూరల్ (చినగదిలి) మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 187/1లో ఉన్న 4.89 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై రెవిన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఆ భూములను సిపిఐనేతల బృందం సందర్శించి, పరిశీలించింది. ఈసందర్భంగా ఆ పార్టీనేత జీవి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మాజీ సైనికోద్యోగి వాసుపల్లి సత్తెయ్య పేరిట డిఆర్ నెంబరు 385/87తో ఇచ్చిన పట్టాను సృష్టించి, అతని భార్య పిల్లలకు తెలియకుండా క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు జరిగి, చివరకు గుజ్జల ప్రసన్న, ధర్మాన రామ్‌మనోహరనాయుడులకు అమ్మేశారన్నారు. ఈ వ్యవహారంలోజరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సిట్‌కు కూడా సిపిఐ తరపున ఫిర్యాదు చేశామన్నారు.కార్యక్రమంలో సిపిఐ నగర నేతలు మరుపల్లి పైడిరాజు, వి. సత్యనారాయణ, వెలగణి రావు పాల్గొన్నారు.

# త్వరలో గంగవరం పోర్టును స్తంభింపజేస్తాం

### అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాల సమావేశంలో తీర్మానం.



సంఘీభావం ప్రకటిస్తున్న అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు

**ప్రజాశక్తి-గాజువాక :** నిర్వాసిత కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆదానీ గంగవరం పోర్టును త్వరలో స్తంభింప చేస్తామని అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు ప్రకటించాయి. బుధవారం సమతా నగర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో 50 రోజులకు పైగా కార్మికులు ఉద్యమిస్తున్నప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని, పలు దఫాలు చర్చలు జరిగినప్పటికీ పరిష్కారానికి అదానీ పోర్ట్ యాజమాన్యం ముందుకు రావడం లేదని కార్మికులు, అఖిలపక్ష పార్టీలు నేతలు అభిప్రాయపడ్డారు. యాజమాన్య వైఖరికి నిరసనగా కార్మిక, ప్రజా సంఘాలు, స్థానిక ప్రజలతో గంగవరం పోర్టును స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల సమస్యలపై జిల్లా మంత్రి, అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలతో తనవంతుగా కృషి చేస్తున్నప్పటికీ, యాజమాన్యం ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, సంప్రదింపులు ద్వారా గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ శాసనసభ్యులు చింతలపూడి వెంకటరామయ్య, యూనియన్ గౌరవ అధ్యక్షులు 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జనసేన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి కాంగ్రెస్ జిల్లా నాయకులు జెర్రిపోతుల ముత్యాలనాయుడు, స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ, ఐఎన్‌టియుసి స్టీల్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, సిపిఎం నాయకులు కెఎం శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కొవిరి అప్పలరాజు, ఐఎన్‌టియుసి నాయకులు కొవిరి అవతారం, స్టీల్ ప్లాంట్ నిర్వాసిత యూనియన్ నాయకులు ఇతను భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, దిబ్బపాలెం గ్రామ పెద్దలు చీకుటి అప్పారావు, నొల్లి తాతారావు, పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాద అప్పారావు గంటిపల్లి అమ్మోరు, వాసుపల్లి ఎల్లయ్య, కదిరి సత్యానందం, గంటిపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

## కేన్సర్ బాధిత బాలుని వైద్యానికి జైజవాన్ ఫౌండేషన్ చేయూత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలాజీ

**ప్రజాశక్తి -ఆనందపురం:** కేన్సర్‌తో బాధిత బాలుని వైద్యసాయానికి జైజవాన్ ఫౌండేషన్ విరాళాల ద్వారా సమకూర్చిన రూ.52వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆనందపురం 24 కాలనీకి చెందిన ఆవాల బాలాజీ అనే నాలుగేళ్ల బాలుడు కేన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. బాలుని చికిత్సకు ఆర్థికసాయం కోస తల్లిదండ్రులు దుర్గాప్రసాద్ భవాని ఆనందపురం జై జవాన్ ఫౌండేషన్‌ను సంప్రదించారు. దీనిపై సోషల్‌మీడియాలో సాయం కోసం అర్థించగా, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను ఫోన్‌పే నెంబర్ 9052782447 నెంబరకు రూ.37వేలు, ఆనందపురం గ్రామం 24 కాలనీకి చెందిన యువత వైజాగ్‌లో ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో కాంట్రాక్టర్ బేసిక్‌లో పనిచేస్తున్న యువత సమకూర్చిన మరో రూ.పది వేలు, ఏనుగుపాలెం సాగర్ దుర్గ లారీ ట్రాన్స్‌పోర్ యజమాని కొట్యాడ గోపి, అనురాధ దంపతులు రూ.ఐదు వేలు ధనసాయం చేయగా, ఆ మొత్తాన్ని బాధిత బాలునికి అందజేయనున్నట్లు జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. దాతలు సహకరించాలని కోరారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎంపీ ఎంవివి



ముఖ్యమంత్రి జగన్‌తో ఎంపీ ఎంవివి, జివి

**ప్రజాశక్తి- సీతమ్మధార/ఎంవిపి.కాలనీ:** విశాఖ ఎంపీ ఎంవివి. సత్యనారాయణ, స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ మాజీచైర్మన్, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వర రావు (జీవీ), బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## 9న జాతీయ లోక్ అదాలత్




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

**ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ :** వచ్చేనెల 9న జాతీయ, రాష్ట్రీయ న్యాయ ప్రాధికార సంస్థల ఆదేశానుసారం విశాఖ జిల్లా కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్‌లను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఆలిపాటి గిరిధర్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ అధికారులు, జివిఎంసి, రెవెన్యూ, విద్యుత్ శాఖ, ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితర సంస్థల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో లోకదాలత్‌లో పెద్దయెత్తున కేసులు పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.. భారతీయ సాక్ష్యాధార చట్టంలోని సెక్షన్ 65 'బి' శాస్త్ర సాంకేతిక సాక్ష్యాల ఆవశ్యకత గూర్చి అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవి శేషమ్మ, మెజిస్ట్రేట్ హిమబిందు, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ మెంబర్ బై అరుణ్‌కుమార్, సీనియర్ జూనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా న్యాయవాదులు సంఘాల ప్రతినిధులు, న్యాయమూర్తులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు.




చంద్రయాన్-3 విజయవంతంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. అగ్రదేశాలకే అందని ద్రాక్షగా ఉన్న జాబిల్లి దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ సురక్షితంగా కాలిడడం ద్వారా భారత్ అంతరిక్ష రంగంలో భారత్ సరికొత్త చరిత్రను లిఖించి చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా ఆవిర్భవించింది. 140కోట్ల భారతీయులు కలలను సాకారం చేసింది. చంద్రుడి నిర్మాణం, అక్కడి వాతావరణం, పరిమాణంపై చంద్రయాన్-3 పరిశోధించనుంది. దశాబ్ధంన్నర క్రితమే జాబిలపై నీటి జాడలను గుర్తించిన భారత్, తొలి ప్రయత్నంలో చంద్రుని దక్షిణ దృవంపై దిగడంలో విఫలమైనా, మూడో ప్రయత్నంలో విజయవంతమై జయహో భారత్ అనిపించుకుంది.. ఈ అద్భుత విజయంపై పలువురు అభిప్రాయాలు...

# చంద్రయాన్-3 విజయంపై సర్వత్రా హర్షాతిరేకాలు

### మహోన్నత విజయం



ప్రపంచ చరిత్రలో అద్భుతం. భారత్ వైజ్ఞానిక సత్తా ప్రదర్శనకు ఇదొక మధుర జ్ఞాపకం. నాలుగేళ్ల క్రితం చేదు జ్ఞాపకాన్ని తుడిచిపెట్టి, అనూహ్య ప్రతికూలత, తీవ్రమైన ఒత్తిడి, ఒకటే ఉత్కంఠ, ప్రపంచ దేశాలన్నీ మనవైపే చూస్తున్న ఉద్విగ్న క్షణాల్లో మన ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన మహోన్నతమైన విజయానికి దేశ ప్రజలు నీరాజనాలు అర్పిస్తున్నారు.

**బూరెల కృష్ణమోహన్‌నాయుడు,**
**సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, గోపాలపట్నం.**

### తడబడ్డచోటే నిలబడ్డారు..



చంద్రయాన్-3 విజయం కోసం ఇస్రో శాస్త్రవేత్తలు నమ్మకం, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా కృషిచేసి, అపురూప విజయం సాధించారు. తడబడ్డచోటే నిలబడి, భారత్ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పారు.

**వి.రవికుమార్,**
**స్కేటింగ్ కోచ్.**

### విశ్వవ్యాప్తమైన భారత కీర్తిప్రతిష్ట



చంద్రయాన్-3 విజయవంతం కావడంతో భారత దేశ కీర్తి ప్రతిష్టలు దశదిశలా విశ్వవ్యాప్తమై విస్తరించాయి. ఇస్రో శాస్త్రవేత్తల కృషికి ధన్యవాదాలు. అగ్రదేశాలకు అందని దాన్ని సాకారం చేసి చూపించారు.

**పొట్నూరు మురళీ మోహనరావు**
**ప్రధానోపాధ్యాయులు, జెడ్‌పిహెచ్‌ఎస్,**
**చిట్టివలస విశాఖ జిల్లా**

### అగ్రదేశాల సరసన...



చంద్రయాన్ -3 విజయవంతంతో చంద్రుని చేరుకున్న 4వ దేశంగా భారత దేశం నిలిచింది. చంద్రుని దక్షిణ ధృవాన్ని చేరుకున్న తొలి దేశంగా అవతరించింది . ఇస్రో శాస్త్రవేత్తల కృషి దేశానికే గర్వకారణం.

**జయంతి రాధాకుమారి, హెచ్ఎం**
**రాయిపాలెం, జివిఎంసి జోన్,1**

### భారత్‌కు గర్వకారణం

**గాజువాక :** చంద్రయాన్-3 విజయం భారతదేశానికి గర్వకారణమని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి. పూర్ణానంద శర్మ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి యలమంచిలి అప్పారావు అన్నారు. ఈ విజయంతో భారతదేశ సత్తాను ప్రపంచ దేశాలకు చాటిచెప్పడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

### గర్వంగా ఉంది



చంద్రయాన్ - 3 విక్రమ్ ల్యాండర్ ప్రజ్ఞాన్ రోవర్‌తో కలిసి మాడ్యూల్ సాఫ్ట్ ల్యాండింగ్ విజయవంతం చేయడంలో మన అంతరిక్ష శాస్త్రవేత్తలు చూపిన ప్రతిభా పాటవాలను ప్రపంచ అంతరిక్ష పరిశోధకులు ప్రశంసలు అందించిన తీరు అద్భుతం. చంద్రునిపై సాగుతున్న పరిశోధనల్లో మన భారతీయులు ముందు వరసలో నిలవడం గర్వంగా ఉంది.

**- పిఎన్.తిలక్, ఎంటర్‌పెన్యూర్, యలమంచిలి**

### అద్భుతమనిపించింది



చంద్రయాన్-3 ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారం చూస్తుంటే అద్భుతమనిపించింది. స్పేస్ పరిశోధకుల అవిరళ కృషి ఫలించినందుకు భారతీయురాలిగా గర్వపడుతున్నాను. ప్రపంచ దేశాల స్పేస్ షిప్‌లు చౌకగా ఇస్రో నుంచి మరిన్ని ప్రయోగించబడ తాయనడంలో అతిశయోక్తి లేదు. ఇది భారతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రాలకు లాభసాటిగా కూడా భవిష్యత్తులో పరిణమించే అంశం.

**-ఎ.సుప్రియ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యలమంచిలి.**

### ఆనందానికి అవధుల్లేవు..



చంద్రయాన్ -3 విజయం సాధించిన దృశ్యాలను పిల్లలు, పెద్దలతో కలిసి ఆ మరుపు రాని దృశ్యాన్ని తిలకించడం వల్ల కలిగే ఆనందం మాటల్లో చెప్పలేను. రాబోయే తరానికి వైజ్ఞానిక, సాంకేతిక పునాది వేసి, మార్గదర్శకంగా నిలిచిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

**ఎం ఎం కుమారి, ప్రిన్సిపల్,**
**సన్‌ఫ్లవర్ స్కూల్, మధురవాడ.**

### విశ్వగురు భారత్



సంస్కృతి, సాంప్రదాయాలకు, మానవతా విలువలకు విశ్వగురువు భారత్, ఇపుడు చంద్రయాన్-3 విజయంతో శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచానికి మార్గదర్శకం కానుంది. చరిత్ర పుటల్లో తిరుగులేని రికార్డుతో చంద్రయాన్ 3 అమోఘమైన విజయాన్ని సాధించింది.

**కొంతం రాజేష్ , రైల్వే ఉద్యోగి , గోపాలపట్నం.**

### మరపురాని అనుభూతి



చంద్రయాన్ - 3 సాఫ్ట్ ల్యాండింగ్ ద్వారా అమెరికా, చైనాల అంతరిక్ష పరిశోధనలకు ధీటుగా నిలిచి తన సత్తా చాటడం ప్రతి భారతీయుడికి గర్వకారణం. సాయంత్రం నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించడం జీవితంలో మరుపురాని ఒక అనుభూతిని నిలిపింది.

**- పూరీ జగన్నాథం, రిటైర్ట్ వైస్ ప్రిన్సిపాల్,**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యలమంచిలి**

### భారత్ సత్తా చాటారు..



చంద్రయాన్-3 విజయంతో భారత వైజ్ఞానిక సత్తాను ఇస్రో శాస్త్రవేత్తలు ప్రపంచానికి చాటి చెప్పారు. కోట్లాదిమంది భారతీయుల నమ్మకాన్ని నిలిపారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర లిఖించడం గర్వకారణం.

**సంభాన రూపవతి,**
**విశాఖ, అనకాపల్లి జిల్లాల కోఆర్డినేటర్,**
**ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్,**

## చంద్రయాన్ విజయంతో సంబరాలు

**ఆనందపురం:** చంద్రయాన్-3 విజయంతో నీళ్లకుండీలు జంక్షన్ వద్ద శ్రీసాయి స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు జయహో భారత్ అంటూ నినదించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు స్వీట్స్ పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. వెల్లంకి రవీంద్ర భారతి గ్లోబల్ పాఠశాల,గుడిలోవ విజ్ఞాన విహార్, గొట్టిపల్లి న్యూలైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు సంబరాలు జరుపుకొని, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. పాఠశాల డైరెక్టర్ శ్యామ్ మాథ్యూస్, ప్రిన్సిపాల్ జయశ్యామ్ పాల్గొన్నారు

**భీమునిపట్నం:** చంద్రయాన్ -3 విజయంతో ప్రభుత్వ డైట్‌లో అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, సిబ్బందిజాతీయ పతా కాలు చేత బూని జయహో భారత్, జయహో చంద్ర యాన్ అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ జి రవి, అధ్యాపకులు ఎస్ త్రినాథ రావు, జె మాధవి, పి హరిణి, సోమ యాజులు, ఎం మహా లక్ష్మి పాల్గొన్నారు



భీమిలి డైట్‌లో చంద్రయాన్ విజయోత్సవ సంబరాలు

# అద్దె బస్సు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

## ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజు కొనసాగిన ధర్నా

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి ఆర్టీసీ డిపో యాజమాన్యం అద్దె బస్సు కార్మికులపై వేధింపులకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో రెండో రోజు బుధవారం కూడా డిపో ఎదుట కార్మికులు ధర్నాను కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్రావు, హైయర్ బస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలక సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లకు అద్దె బస్సు డ్రైవర్లకు ఒకే విధమైన పనిష్మెంట్లు ఇవ్వాలని ఆర్టీసీ ఎండీ ఇచ్చిన సర్క్యులర్‌ను రాష్ట్రంలోని అన్ని డిపోలలో అమలు చేస్తుండగా అనకాపల్లి డిపోలో మాత్రం జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి అమలు చేయడం లేదని తెలిపారు. డ్యూటీకి వచ్చే ముందు బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో వచ్చే పాయింట్ ఆధారంగా కార్మికుడిని ఒకరోజు డ్యూటీ ఆపాలని, అయితే పదేపదే వస్తున్నప్పుడు విధుల నుంచి తొలగించాలని, అటువంటిది యాజమాన్యం వెంటనే విధుల నుంచి ఆపేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు ఆపలేదని పాసింజర్ ఫిర్యాదు చేస్తే ఎటువంటి విచారణ లేకుండా డ్యూటీలు నిలుపుదల చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం చేయకపోతే అద్దె బస్సు డ్రైవర్లు సమ్మెకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగ అప్పారావు, కార్యదర్శి నాగేశ్వరరావు, శేఖర్, నాయుడు, వర్మ, కార్మికులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న అద్దె బస్సుల కార్మికులు



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

## మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపల్ కార్మికుల సమస్యలపై సిఐటియు నాయకులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుజిడి, మలేరియా, ఇంజినీరింగ్ విభాగాల కార్మికుల సమస్య పరిష్కారానికి గురువారం చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామని, ఇందులో యలమంచిలి మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం అమలు చేసి డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.రాము, ప్రజాసంఘాల కన్వీనర్ కె.సోమునాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, నారాయణ పాల్గొన్నారు.

## ఆంగ్ల మాధ్యమ నైపుణ్య ఉపాధ్యాయుల నుండి ప్రత్యేక అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లో ఆంగ్ల మాధ్యమంలో నైపుణ్యాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవార్డులందజేయనున్నట్టు డిఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు విధి విధానాలకు సంబంధించి దరఖాస్తులను http://centa.org/events/ap-centa-tq లింకులో పరిశీలించి దరఖాస్తులను ఈ నెల 27లోగా ఆన్లైన్లో పంపాలని సూచించారు.

## గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి -దేవరాపల్లి : తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాధ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పడాలదాస్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం తెలుగు భాష వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గిడుగు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పద్య పఠనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## అద్దె చెల్లించలేదని గ్రామ సచివాలయానికి తాళం

### పంచాయతీ కార్యదర్శి హామీతో శాంతించిన ఇంటి యాజమాని

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం లోపూడి గ్రామ సచివాలయ భవనానికి రెండున్న సంవత్సరాలుగా అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని సకల బాబూరావు బుధవారం సచివాలయానికి తాళం వేశారు. అద్దె భవనంలో నడుస్తున్న లోపూడి గ్రామ సచివాలయానికి నెలకు రూ.2,500 అద్దె చెల్లించాల్సి ఉంది. కాని రెండున్నరేళ్లగా అద్దె చెల్లించకపోవడంతో యజమాని ఆగ్రహించి తాళం వేశారు. దీంతో విధులకు వచ్చిన సిబ్బంది ఎంపీడీఓకు సమాచారం ఇచ్చి బయట కూర్చున్నారు. సచివాలయానికి వచ్చిన పలువురు బయట ఉండిపోయారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి లోవరాజు చొరవ తీసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి కొద్ది రోజుల్లో అద్దె చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో యజమాని బాబూరావు శాంతించి తాళం తీశారు. దీంతో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించారు.



భవనానికి తాళం వేయడంతో బయట అర్జీలు తీసుకుంటున్న సిబ్బంది

## ఓటర్ల ఇంటింటి సర్వే 97.73 శాతం పూర్తి

### జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి



సమావేశంలో పాల్గొన్న జెసి, అధికారులు, వివిధ పార్టీల నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో జరిగిన ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన 97.73 శాతం పూర్తయిందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు సంబంధించి 1526 పోలింగ్ కేంద్రాలలో 12,75,625 మంది ఓటర్లు జాబితాలో ఉండగా వారిలో 12,46,634 మందిని పరిశీలించారని చెప్పారు. 15,013 పౌరులు ఓటు నమోదు చేసుకోలేదని, 17 సంవత్సరాలు నిండిన 3,657 మంది కొత్త ఓటర్లగా నమోదుకు గుర్తించారని తెలిపారు. రెండు చోట్ల ఉన్నవారు 2,301 కాగా శాశ్వతంగా స్థలం మారిన వారు 6,764 మంది ఉండగా 33,029 మంది ఓటర్లు మృతి చెందినట్లుగా గుర్తించి నట్టు వెల్లడించారు. 31,404 తప్పులు సరిదిద్దడం జరిగిందని, 1678 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. తమ దృష్టికి రాని విషయాలను పార్టీల ప్రతినిధులు తెలియజేయాలని కోరారు. దీనిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఓటరు పరిశీలనకు తమ ఇంటికి రాలేదని కొంతమంది చెబుతున్నారని తెలియజేయగా పరిశీలించి తగిన చర్యలు చేపట్టవలసిందిగా ఆర్డిఓ, వీఆర్వోలను ఆదేశించారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఆర్డీవో ఏ.చిన్నికృష్ణ, నియోజకవర్గ ఎన్రోలింగ్ అధికారులు ప్రమీల గాంధీ, జ్ఞానవేణి, రామలక్ష్మి ఎన్నికల సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డిటి రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు సూరిబాబు (వైసిపి) గంటా శ్రీరామ్ (సిపిఎం) కె.హరినాథ్ బాబు (ఆప్) సిహెచ్.నాగేశ్వరరావు (బిజెపి) బి.శ్రీనివాసరావు (టిడిపి) ఎస్‌వివి.రామచంద్రరావు (బిఎస్‌పి) తదితరులు పాల్గొన్నారు.

### సర్వే సజావుగా జరిగేందుకు సహకరించండి

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎన్నికల సర్వే సజావుగా జరిగేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని ఆర్డీవో చిన్నికృష్ణ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాబితాలను అందజేశారు. హౌస్ టు హౌస్ సర్వే వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొర్లి సూరిబాబు, టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఐఆర్ గంగాధర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, డిఎస్‌పి నాయకులు రామచంద్రరావు, డిప్యూటీ తహశీల్దారు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-సబ్బవరం : మాదక ద్రవ్యాల నిషేధంపై మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కెవి.మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని, ఈ దశలో అనేక రకాలైన బలహీనతలు విద్యార్థుల జీవితంపై ప్రభావితం చేస్తాయని, వాటిలో మాదక ద్రవ్యాల వినియోగం ఒకటని పేర్కొన్నారు. ఇలాంటి బలహీనతలకు గురికాకుండా విద్యార్థులు నియంత్రించుకోవాలని సూచించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉన్నప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ ప్రొహిబిషన్ యాక్ట్ ప్రకారం అనేక రకాల శిక్షలు విధించబడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య పి.సుధా, రిజిస్ట్రార్ డాక్టర్ పి.జోగినాయుడు, డిఎస్పీ సత్యనారాయణ, సీఐ పి.రంగనాధం, ఎస్ఐ ఎల్.సురేష్, వర్సిటీ అకడమిక్ డీన్ డాక్టర్ సోమభట్టాచార్య, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ హేమంత్

## ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని ఒంపోలు గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎ.హేమంత్ బుధవారం ఆకస్మిక పరిశీలించారు. గర్భిణులకు రక్తశాతం 12కు మించి ఉండాలన్నారు. గ్రామాలలో 30 సంవత్సరాలు పైబడిన రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులను సర్వే చేసి యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి శబ్బం, సిహెచ్ఓ ఆర్ దేవకాంత, ఎమ్మెల్‌హెచ్ పి సౌమ్య, ఏఎన్ఎం నాగజ్యోతి, ఆరోగ్య కార్యకర్త జగన్నాధరావు, డీఈవో విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు సుబ్బలక్ష్మి, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఎంవిఆర్ ప్రోత్సాహం

ప్రజాశక్తి- అనకాపల్లి

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించేందుకు ఎంవిఆర్ ఎప్పుడూ ముందుంటారని ఆయన తనయుడు ముత్యాల సతీష్ (సంజూ బాబు) పేర్కొన్నారు. స్థానిక నర్సింగ్రావుపేట ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం విజయరామరాజుపేట ప్రాంతానికి చెందిన వంశీ రాంచీలో జరిగే జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో పాల్గొనేందుకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడలలో ప్రతిభ కనబరిచి, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందిన క్రీడాకారులకు ఆర్థికపరమైన భరోసా ఇవ్వడం వలన వారిలో ఆత్మవిశ్వాసం పెరిగిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ పిఎ సతీష్ కుమార్, యువసేన సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంవిఆర్ తనయుడు సతీష్



యువజనోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులతో డైట్ చైర్మన్ రత్నాకర్

## డైట్‌లో జిల్లా యువజనోత్సవాలు

ప్రజాశక్తి - అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాలలో బుధవారం జిల్లా యువజన ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సోనీ డైసీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అదనపు నైపుణ్యత కలిగి ఉండాలన్నారు. వివిధ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులకు డాన్స్, సాంగ్స్, పోస్టర్స్, స్టోరీ రైటింగ్, ఫోటో గ్రఫీ తదితర విభాగాలలో పోటీలు నిర్వహించి ఆయా విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, జ్ఞాపికలు, సర్టిఫికెట్లను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ చేతులమీదుగా అందజేశారు. కెవిఎస్ఎన్ మూర్తి, జి. మహేశ్వరరావు మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ .వైకుంఠరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇస్రో శాస్త్రవేత్తలకు ఎంపీ అభినందనలు

ప్రజాశక్తి - అనకాపల్లి : చంద్రయాన్-3తో యావత్ భారతదేశం గర్వించదగ్గ విజయం అందించిన శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచమంతా నేడు భారతదేశం వైపు చూస్తోందన్నారు. ఇటువంటి మరెన్నో విజయాలు ఇస్రో అందుకోవాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. రష్యా అమెరికా, చైనా తర్వాత నేడు ఆ ఘనతను మన భారత్ సాధించిందని చెప్పారు.

### నాగజగదీష్ అభినందనలు

చంద్రయాన్-3 ద్వారా చంద్రునిపై కాలు మోపిన నాలుగవ దేశంగా గుర్తింపు తీసుకొచ్చిన ఇస్రో శాస్త్రవేత్తలకు తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అభినందనలు తెలియజేశారు.

## ఉపాధ్యాయులతో బంతాట

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉపాధ్యాయ బదిలీలు జరిగి మూడు నెలలు పూర్తి కాకుండానే మళ్లీ పని సర్దుబాటు పేరుతో వారితో జగన్‌రెడ్డి ప్రభుత్వం బంతాట ఆడుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విద్యా వ్యవస్థను గందరగోళంలో పెట్టిన ఘనత విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్యమంత్రి జగన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 1800 మంది ఉపాధ్యాయులకు జీతాలు అందకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పది రోజుల క్రితం డిఇఒకి తెలియజేస్తే వారం రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారని, కాని నేటికీ పరిష్కారం కాలేదన్నారు. దీనిపై పెద్ద ఎత్తున విద్యాశాఖ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. జీవో నెంబర్ 117 ద్వారా 3, 4, 5, తరగతులను ఉన్నత పాఠశాల విలీనం చేయడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయిందని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ కెకెవి.నారాయణరావు, కుంద్రపు రామునాయుడు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలో కోట్ని వీధి మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఈనెల 31న జరగనున్న సందర్భంగా కోరుకొండ రాఘవ మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం రింగ్ రోడ్ నెట్ గ్రౌండ్లో ఎప్పెట్ల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ ఈ పోటీలు ఏడు రోజులపాటు జరుగుతాయని, విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మెన్స్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎప్పెట్ల సత్యనారాయణను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట్ని శ్రీనివాసరావు, ధర్మకర్తలు అలం ప్రసాద్, కోరుకొండ వాసు, సీతా నూకరాజు, కొటయర్ నాగరాజు, లక్కీ డిప్ స్వప్న, కేతిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలింపుపై కేసు నమోదు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో గల పెద్దమదీన గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను బుచ్చయ్యపేట పోలీసులు బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

# వలస కార్మికుల మృతిపై విచారణ చేపట్టాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం ఎస్ఇజెడ్ పరిశ్రమల్లో పని చేస్తున్న వలస కార్మికులు ముగ్గురు మృతిపై విచారణ చేపట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము డిమాండ్ చేశారు. మృతి చెందిన వలస కార్మికుల నివాస షెడ్లను బుధవారం రాము, సిఐటియు మండల నాయకులు కె.సోమినాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ మృతి చెందిన కార్మిక కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కడుపు చేత పట్టుకుని పని కోసం వేల కిలోమీటర్లు వచ్చిన వలస కార్మికులు కష్టాలతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ప్రభుత్వాలు ఎటువంటి సహాయ సహకారాలు అందించడం లేదన్నారు. ఇక్కడి కార్మికులకు రక్షణ కరువైందని, పని భద్రతను ప్రభుత్వాలు, యజమానులు పట్టించుకోలేదని విమర్శించారు. ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి కార్మికులు ఎంతమంది వస్తున్నారు, వారు ఏయే పరిశ్రమల్లో ఎంతెంత మంది పని చేస్తున్నారు, ఎక్కడ నివాసం ఉంటున్నారు, వారికి వేతనాలు ఎంత ఇస్తున్నారు అనే విషయాలను కార్మిక శాఖ పట్టించుకోవడం లేదని, ఏపీఐఐసీ వద్ద వివరాలు లేవని పేర్కొన్నారు. వలస కార్మికులను తీసుకొచ్చిన కాంట్రాక్టర్ కార్మికులకు మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. ఒకే షెడ్‌లో 50 మంది వరకు ఉంచడం దారుణమన్నారు. వలస కార్మికుల మరణాలపై సుమోటుగా తీసుకొని విచారణ చేపట్టాలని, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.



వలస కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

# మండల సమావేశంలో సమస్యలపై నిలదీత





మాట్లాడుతున్న ఎంపిపి గోవిందరావు

ప్రజాశక్తి - యలమంచిలి

మండల ప్రజాప్రతినిధులు అతి ముఖ్యమైన సమస్యలు లేవనెత్తితే, వాటికి అధికారులు కనీస పరిష్కారాలు సైతం చూపలేకపోయారు. యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోదెపు గోవిందరావు అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో నీటిపారుదలశాఖ తీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. పులపర్తి, పురుషోత్తపురం పంటపొలాలకు నీరందించడంలో అధికార్లు విఫలమయ్యాయన్నారు. పురుషోత్తపురం తాళమ్మచెరువు ఛానల్‌కు బాక్స్ తూము కట్టాల్సి ఉండగా పైప్‌లైన్లు వేసి నీటిని పారకుండా అధికారులే అడ్డుకోవడం అన్యాయమని వైస్ ఎంపిపి శేషు పేర్కొన్నారు. గతంలో నీటిసంఘాలకు కేటాయించిన రూ.18లక్షలు ట్రెజరీలో మూలుగుతున్నాయని, ఆ డబ్బుతో గేట్లు బిగించి రైతుల్ని ఆదుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ మళ్ల కొండబాబు సూచించారు. ఇక్కడ గంజాయి తాగే వారి సంఖ్య విపరీతంగా పెరిగిందని, అయినా గంజాయి కేసు ఒక్కటి కూడా పట్టుకున్న దాఖలాలు లేదని ఎంపిపి గోవిందరావు అసహనం వ్యక్తం చేశారు. సారాను కూడా అరికట్టలేకపోయారని పలువురు సర్పంచ్‌లు విమర్శించారు. రైలు ట్రాక్ దాటించి విద్యుత్ లైన్ ఇవ్వలేకపోవడం చేత కొత్తలి గ్రామం నుండి మూడు నాలుగు గ్రామాలు విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నాయని సభ్యులు తెలిపారు. విద్యుత్ ఎప్పుడు పోతుందో తమకు కూడా తెలియడం లేదని యలమంచిలి ట్రాన్స్ ఏఇ కనకరాజు చెప్పడంతో సభ్యులు ఈ సమస్యను ఎవరి చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాము, వైస్ ఎంపిపిలు రాజాన శేషు, శిలపరశెట్టి ఉమ, తహశీల్దార్ రాణిఅమ్మాజీ, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# 30 నుండి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన

ప్రజాశక్తి-కె.కోటపాడు : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సిపిఎం మండల నాయకులు యర్ర దేవుడు తెలిపారు. ఈ మేరకు మండలంలోని గొండుపాలెం గ్రామంలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బండారు దండు, వంటాకు నాయుడు, బండారు రమణ, బండారు వెంకటరావు, అప్పలపాత్రుడు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

# నిరుద్యోగ సమస్యపై జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఈ నెల 25న విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న జాతీయ సదస్సును జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ అనకాపల్లి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం స్థానిక దొడ్డి రామునాయుడు భవన్లో సదస్సు పోస్టర్ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందాయన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ తొమ్మిదేళ్ళ అవుతున్నా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, పైగా ఉన్న ఉద్యోగాలు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నేటికీ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. పరిశ్రమలలో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు ఇవ్వాలని చట్టం చేసినా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.శివ, ఉపాధ్యక్షులు అల్లు రాజు, జిల్లా నాయకులు పి చలపతి, సాయి పాల్గొన్నారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

## రైళ్లను రద్దు చేయడం సరికాదు



బుద్ధ రాజేష్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ప్రజలతో చెలగాటం ఆడుతున్నారని, రైళ్ల రద్దు చేయడం అలవాటుగా మారిపోయిందని, ఏకంగా 57 రైళ్ల రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు బుద్ద రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 21 నుండి31వ తేదీ వరకు 57 రైళ్లు రద్దు చేశారని, ట్రైన్ కి వెయ్యి మంది ప్రయాణికులు చూసుకున్నా 57 రైలు ఉంటే సుమారు 57,000 మంది రోజుకి ప్రయాణానికి ఇబ్బందులు పడనున్నారని తెలిపారు. ట్రాక్‌ల రిపేర్లు చేయడం సమర్థనీయమే అయినా ఒక ట్రాక్ రిపేర్ చేశాక ఆల్టర్నేట్ ట్రాక్ ఉంచి రైలు వెళ్లే లాగా చర్యలు తీసుకోవాలి, తప్పు ఒకరోజు 57 రైలు రద్దు అంటే ప్రజలు అప్పటికప్పుడే ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదిక మీద సిబ్బందిని ఏర్పాటు చేసి కనీసం ఒక ట్రాక్ నైనా పునరుద్ధరించి కొన్ని రైళ్ల అయినా నడపాలని రాజేష్ డిమాండ్ చేశారు.

## 26న జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండల కేంద్రం మునగపాకలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఈ నెల 26న పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 26న రాత్రి కార్యాలయాన్ని ప్రారంభించగా, 27న ఆదివారం 12 గంటలకు విందు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఒంపోలు సర్పంచ్ సూరిబాబు, మొల్లేటి ఆనంద్, కోరుకొండ కాశీ, భాస్కరరావు, ఆడారి ప్రసాద్ పాల్గొన్నారు.

## ఆరు నెలలకొకసారి కొత్త పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - యలమంచిలి : ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు ఎంపిడిఒ ఎం.అప్పలనాయుడు తెలిపారు. మండలంలో లైన్‌కొత్తూరు, రేగుపాలెం గ్రామ పంచాయతీల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నుంచి జూన్ నెల వరకు ఈ ఆరు నెలల్లో చేసుకున్న దరఖాస్తులు పరిశీలించి మంజూరైన వారిని కలిసి నిర్ధారణ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారు మిగిలి ఉంటే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వెల్ఫేర్ కార్యదర్శి కూడా పాల్గొన్నారు.

## 27వ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : అంగన్వాడీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌లు తీసివేయాలని, దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 27న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని జరుగు ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు చెక్క రాంబాబు, శేఖర్ పాల్గొన్నారు.

## వైకెపి మండలం అధ్యక్షులుగా రమాదేవి

ప్రజాశక్తి-దేవరాపల్లి : వైయస్సార్ క్రాంతి పథం మండల మహిళా సమైక్య నూతన అధ్యక్షురాలుగా దేవరాపల్లికి చెందిన గొర్రెపోటు రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వైకెపి కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమైక్య సర్వసభ్య సమావేశం జరిగింది. ఏపిఎం ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుతో పాటు పాలకవర్గ సభ్యులను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో 46 గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌లో సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి- చీడికాడ:**చీడికాడ మోడల్ స్కూల్ లో దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇ,నరసింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. బుధవారం మోడల్ స్కూల్‌ను పరిశీలించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ మోడల్ స్కూల్ కు రాష్ట్రంలో బెస్ట్ స్కూల్ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. ఈ స్కూల్లో చాలా సమస్యలు ఉన్నాయని, వీటిని ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని వారు కోరారు. ఈ పాఠశాలలో 532 విద్యార్థులు ఉండగా తాగడానికి మంచి నీటి సౌకర్యం లేక పోవడం బాధాకరమన్నారు.గతంలో నాస స్వచ్ఛంద సంస్థ వాటర్ ప్లాంటు మంజూరు చేసిందని, అది పూర్తిగా మూలన పడిందని వాపోయారు.శాశ్వత (రిక్రూట్మెంట్ ద్వారా) వార్డెన్ లేరన్నారు. హాస్టల్ విద్యార్థులు నారోగ్యం బారిన పడితే దిక్కెవరు అని ప్రశ్నించారు.తాత్కాలింగా ఉన్న వార్డెన్ కూడా ఈనెల1 వ తేదీ నుండి హాస్టల్కు వెళ్లలేదని, ఇక



మాట్లాడుతున్న వెంకన్న

విద్యార్థుల గోడును వినే వారు ఎవరని ప్రశ్నించారు. పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాలని డిమాండ్ చేసారు. స్కూ ల్లో దీర్ఘకాలిక సమస్యలపై ఉన్నతాధికారులకు లేఖ రాస్తామని వారు స్పష్టం చేశారు.తీమిరాం, వాకపల్లి, చీడిపల్లి, తురువోలు, తంగడు బిల్లి మీదుగా స్కూల్ బస్సు నడపాలని కోరారు.

## పీడీ రాజుకు సత్కారం

**ప్రజాశక్తి- యస్.రాయవరం:** మండలంలో గుడివాడ ఉన్నత పాఠశాల పీడీగా పని చేస్తున్న కుందూరు రాజు రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ లో రిఫెరీగా వ్యవహరించి నందుకు గాను ఏటికొప్పాకలో ఇందేశమ్మ అమ్మవారి జాతరలో ఘనంగా సత్కరించారు. టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పీడీ రాజును గ్రామస్థులు, నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అన్నం రాము, మాజీ సర్పంచ్‌లు చిరంజీవి, అన్నం బాబ్జి పాల్గొన్నారు.



సన్మానిస్తున్న స్థానికులు

## దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి- రావికమతం:**రావికమతం సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కార్యాలయ పరిధిలో అంగన్వాడి పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి ఉషారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, ప్రాజెక్టు పరిధిలో రావికమతం, చోడవరం, బుచ్చయ్యపేట, రోలుగుంట మండలాలలో అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడి సహాయకురాలు పోస్టులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఈ ఈనెల 23వ తేదీ నుండి 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

**ప్రజాశక్తి-మాడుగుల:**చంద్రయాన్ విజయవంతంపై శ్రీ విజ్ఞాన్ టెక్నో స్కూల్ విద్యార్థులు ఇస్రో పేరుతో మానవ సమాహారం ఏర్పాటు చేశారు. భారత శాస్త్రవేత్తల కృషి ప్రపంచ నలుమూలలకు తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో పిన్సిపల్ కొండలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇస్రో ఆకారంలో విద్యార్థులు

# పంచాయతీ కార్మికుల నిరసన

**ప్రజాశక్తి-గొలుగొండ:**గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని పంచాయతీ పారిశుధ్యం కార్మిక సంఘం (సిఐటియు) ఆద్వర్యంలో బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ డేవిడ్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, రెండు నుండి 18 నెలల వరకు గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ కార్మికులకు జీతాలు బకాయిలు పెడుతున్నారన్నారు. ప్రభుత్వం జీతాలు చెల్లించే బాధ్యతల నుండి తప్పుకొని గ్రామ పంచాయతీలపైకి తోసేస్తుందని తెలిపారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు, కరెంటు చార్జీలతో మరింత ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉద్యోగ భద్రతా కల్పించి వెంటనే రాష్ట్రవ్యాప్తంగా బకాయి జీతాలు చెల్లించి గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, పంచాయితీ పారిశుద్యం కార్మిక సంఘం నాయకులు దేవత, రాజు, లోవరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు



అవగాహన కల్పిస్తున్న ఏఓ

## వరి విత్తనాల సాగుపై అవగాహన

**ప్రజాశక్తి-నక్కపల్లి:**వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వరిని వెదజల్లుకుంటే మంచిదని వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరావు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని కాగిత గ్రామంలో బుధవారం వరి వెదజల్లడంపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనం ఒక రోజు నానబెట్టిన తరువాత పొలంలో వెద జల్లు కోవాలని, ఈ పద్ధతిలో పిలకలు ఎక్కువగా వస్తాయని, వేర్లు బలంగా పెరుగుతాయన్నారు. చీడపీడల బాధ తక్కువగా వుంటుందని, వెద జల్లు పద్ధతిలో కలుపు యాజమాన్యం ముఖ్యం గా చూసు కోవాలన్నారు. విత్తిన 3 రోజులకు, 25 రోజులకు కలుపు యాజమాన్యం చేపట్టాలని సూచించారు. వెద జల్లే పద్ధతిలో నాట్లు వేసే పని వుండదని, 15 రోజులు ముందే కోతకు వస్తుందన్నారు.వరిని వెదజల్లడం వలన కూలీలకు అయ్యే ఖర్చు తగ్గడంతో పాటు ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, ఆర్‌బికే పాల్గొన్నారు...

## ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:** విద్యుత్ వినియోగ దారులు విధిగా తమ విద్యుత్ కనెక్షన్కు ఆధార్ నెంబరును అనుసంధానం చేసుకోవాలని నర్సీపట్నం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధార్ జెరాక్స్ కాపీని విద్యుత్ సిబ్బందికి ఇచ్చి సహకరించాలన్నారు. పూర్వీకుల పేరుతో విద్యుత్ సర్వీసు ఉన్నట్లయితే ప్రస్తుతం ఉన్న వారసులు ఆధారాలతో సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా 1921కు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చునన్నారు. గూగుల్ ప్లే స్టోర్లో ఈస్టర్న్ ఫవర్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని ఆన్లైన్లో బిల్లులు చెల్లించే వెసులబాటు కల్పించామన్నారు.

## అయ్యన్నకు గుణపాఠం తప్పదు

### ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు బుధ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అయ్యన్నపాత్రుడు, మాజీ సీఎం చంద్రబాబుకు పదవులు పోయిన దగ్గర నుండి మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు.సైకోలా అయ్యన్న తయారయ్యారన్నారు. రాష్ట్ర అభివద్ధి మేరకే ఢిల్లీ టూర్ జగన్ మోహన్ రెడ్డి వెళ్తున్నారు తప్ప మీలాగా కాదని ఈ సందర్భంగా తెలియజేశారు. తాము మేనిఫెస్టోలో ఏమి చెప్పామో అదే విధంగా పెన్షన్ పెంచుతున్నామన్నారు. ఆనాడు జాబు కావాలంటే బాబు రావాలని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న నీవు ఇంటింటికి ఉద్యోగం ఇచ్చావా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చావో తెలియజేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఆయనకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేస్తారని తెలియజేశారు.



## ఆయా పోస్టు ఎస్‌టికి కేటాయించాలి

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని కొంకసింగి గ్రామంలో రెండు అంగన్వాడి సెంటర్లు ఉండగా రెండింటిని ఒసికే కేటాయించడం తగదని డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి లోవరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్టీ, ఎస్సీ వర్గం 150 మంది ఉన్నప్పటికీ రిజర్వేషన్ లేక పోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై అధికారులు దర్యాప్తు చేసి ఆయా పోస్టును ఎస్సీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ ప్రాతిపదికన అంగన్వాడీ పోస్టులు కేటాయించాలని, ఒకే సామాజిక వర్గానికి కాకుండా ఎస్సీ ఎస్టీ కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# ఘనంగా టంగుటూరి జయంతి

**ప్రజాశక్తి-యంత్రాంగం**

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

**విశాఖ కలెక్టరేట్ :** విశాఖ కలెక్టరేట్‌లో టంగుటూరి చిత్రపటానికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికారున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ పూలమాల వేసి నివాళు లర్పించారు. విశాఖ సెంట్రల్ పార్క్ వద్ద ఉన్న టంగుటూరి విగ్రహానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ఆనందపురం:** ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, మండల పరిషత్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. టంగుటూరి సేవలనుకొనియాడారు

**భీమునిపట్నం** : ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధ వారం మండల పరిషత్‌కార్యాలయంలో నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి ఎంపిపి దంతులూరి వెంకటశివ సూర్యనారాయణ రాజు (వాసు రాజు), సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఎంపిటిసి చెల్లూరి నగేష్ బాబు, ఎంపిడిఒ పి వెంకటరమణ, ఇఒపిఆర్‌డి జి.అప్పలరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి నేతలు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, ఎల్లాజీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**అనకాపల్లి:**స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, డిఆర్ఓ ఎస్‌డి అనిత, జిల్లా అధికారులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు, ఏవో ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా అనకాపల్లి డిఎస్‌పి వి.సుబ్బరాజు ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కశింకోట** : మండలంలోని పరవాడపాలెంలో ఉగ్గిని గంగునాయుడు సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో సంస్థ అధ్యక్షులు ఉగ్గిని రమణమూర్తి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెర్రిపోతుల నూక నాయుడు, కర్రి దుర్గి నాయుడు, మొల్లి రమణ, ఉగ్గిని నాయుడు బాబు, గొంతిన రాజు, పందిరి రమణ పాల్గొన్నారు.





భీమిలిలో నివాళి అర్పిస్తున్న అధికారులు



నక్కపల్లిలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు


**పరవాడ** : మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మీ శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పిచారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, ఎంపిడిఒ హేమ సుందరరావు, వైసిపి నాయకులు చుక్క రామునాయుడు, వెన్నెల సన్యాసిరావు పాల్గొన్నారు.

**నక్కపల్లి:**మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా టంగుటూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. టంగుటూరి జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, సిబ్బంది రమణమ్మ, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు .

# అణుకులో మౌలిక వసతులు కల్పిస్తాం

## -కలెక్టర్ రవి పట్టన్ శెట్టి- గిరిజనుల సమస్యలపై ఆరా

**ప్రజాశక్తి-కోటవురట్ల, అనకాపల్లి:** అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం అణుకు గ్రామానికి మౌలిక వసతులు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. బుధవారం ఆయన అణుకు గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సరిగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందుతున్నదా ఫ్యామిలీ డాక్టర్ వస్తున్నారా అని ఆరా తీశారు. ఇబ్బందికరమైన గర్భవతులు ఎవరైనా ఉన్నారా అని అడిగారు. గ్రామస్తులు చెప్పినవిషయాలపై స్పందించిన కలెక్టర్ అంగన్వాడి భవనం మరమ్మతులు చేయిస్తామని, టెలిఫోన్ సిగ్నల్ వచ్చేటట్లు చేస్తామని, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు బాగున్నాయని కితాబిచ్చారు. ప్రభుత్వ గృహాలు నిర్మించుకునే 10మంది లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి తరలించే సదుపాయం కల్పిస్తామన్నారు. రోడ్డు గురించి కలెక్టర్‌ను గిరిజనులు అడుగుగా ఆ ప్రాంతం అటవీ భూమి కావడంతో గ్రావెల్‌తో నడక మార్గం ఏర్పాటు చేస్తామన్నారు. రేషన్ వాహనం 5 కి.మీ దూరం వరకు వస్తుందని అక్కడి నుండి డోలీలలో సరుకు తీసుకొస్తున్నామని తెలియజేయగా ఇంటి వద్దకే రేషన్ వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. ఈ పర్యటనలో ఆర్డీవో జయరాం, తహసిల్దార్ జానకమ్మ, డిఎల్‌డిఓ ఉదయశ్రీ ఎంపీడీవో సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్


అణుకు గ్రామానికి వెళుతున్న కలెక్టర్

### నేను వస్తున్నానని భోజనం ఇలా ఉందా..

## రోజూ ఇలాగానే ఉంటుందా..

**ప్రజాశక్తి-కోటవురట్ల:** నేను వస్తున్నానని భోజనం ఇలా వండారా లేదా.. రోజు విద్యార్థులకు ఇలా రుచికరమైన భోజనం పెడుతున్నారా అని జిల్లా కలెక్టర్ రవి సుభాష్ అన్నారు. బుధవారం మండలంలో పాములవాక జిల్లా పరిషత్ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. నాలుగో తరగతి విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు చూపించిన నిర్లక్ష్యం పట్ల అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని, అన్ని వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయరాదని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన సమీపంలో జగనన్న కాలనీ సందర్శించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీకి సక్రమంగా రోడ్డు లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు కిల్లాడ శ్రీనివాసరావు గ్రామంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఎంఈఓ రామారావు, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సంక్షేమ కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

**ప్రజాశక్తి -నక్కపల్లి:** అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించినట్లు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు సారిపల్లిపాలెంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేసి, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నక్కపల్లి పిఎసిఎస్ పర్సన్ ఇన్ చార్జి ఎలమంచిలి తాతబాబు, వైసిపి నాయకులు సూరకాసుల గోవింద్, మనబాల తాతారావు ,అధికారులు, సచివాలయం సబ్బంది, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థినికి మెడికల్ సీటు

**ప్రజాశక్తి-మాడుగుల:** కష్టపడి, ఇష్టపడి చదివిన సామాన్య విద్యార్థిని మెడికల్ సీటు సాధించింది. సాగరం గ్రామానికి చెందిన విఆర్ఓ సేనాపతి కృష్ణ ప్రసాద్ కుమార్తె ప్రాథమిక విద్యాభ్యాసం మాడుగుల విజ్ఞాన్ పాఠశాలలో చదివింది. తరువాత అనకాపల్లి చైతన్య పాఠశాల, చోడవరం చలపతి పాఠశాలలో పదవ తరగతి వరకు చదివింది. ఇంటర్మీడియట్ బోయపాలెం శ్రీ చైతన్య లో పూర్తి చేసి, శ్రీ విశ్వ కళాశాలలో నీట్ కోచింగ్ పూర్తి చేసింది. నీట్ పరీక్షల్లో 608 ర్యాంకు సాధించింది. దీంతో, కాకినాడ రంగ రాయ మెడికల్ కళాశాలలో సీటును పొందింది. ఆమెను పలువురు అభినందించారు.


రాజ మౌలిక


శంకుస్థాపన చేస్తున్న ధర్మశ్రీ

## రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు


**ప్రజాశక్తి-రోలుగుంట:** మండలంలోని బోగాపురం సెంటర్ నుండి బిఎన్.రోడ్డు నుండి కొంతలం మీదుగా శరభవరం గ్రామానికి రూ.86.41లక్షలతో ఏపిఎం నిధులు మంజూరయ్యాయని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు రోడ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. బుచ్చింపేట ఆర్చి నుంచి నిండుగొండ మీదుగా బిఎన్.రోడ్డుకు, కొవ్వూరు నూకాలమ్మతల్లి గుడి నుండి నిండుగొండ వరకు, జె.నాయుడుపాలెం నుండి గుండుబాడు బ్రిడ్జి వరకు రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల శ్రీనివాసరావు, కొంతలం సర్పంచ్ వంశీరవీంధ్ర పాల్గొన్నారు.

### వివాహేతర సంబంధంతోనే..

## భర్త హత్య : ఎఎస్‌పి

**ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:** వివాహేతర సంబం ధమే నిండు ప్రాణాన్ని బలిగొందని ఏఎస్పి అదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఏఎస్పీ కార్యాలయంలో మీడియాకు వెల్లడించిన వివరాలు..గొలుగొండ మండలం కొత్తపల్లి పేట గ్రామానికి చెందిన గుడివాడ జానకి, చింతల రాము వివాహేతర సంబంధం సాగిస్తున్నారు. ఈ క్రమంలో జానకి భర్త గుడివాడ అప్పలనాయుడును అడ్డు తొలగించుకునేందుకు హత్య చేసినట్లు తెలిపారు.గుడివాడ జానకికి చింతల రాముతో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారి ఇద్దరి మధ్యన వివాహేతర సంబంధమును పెట్టుకోవడానికి దారి తీసింది. వారిద్దరి మధ్యన ప్రతి రోజు ఫోన్ సంభాషణ జరిగేదని, ఈ విషయం జానకి భర్తకుకు తెలియడంతో ఆమెను పనికెళ్లకుండా మానిపించేశాడు. కోటవురట్ల మండలం పాములవాక గ్రామంలో పట్టాలమ్మ తల్లి గుడికి వెళ్దామని జానికి తన భర్త కు మాయ మాటలు చెప్పి తీసుకుని వెళ్లింది. ఆ విషయం రాముకి తెలియ జేయడంతో వెనుక కొద్ది దూరంలో అనుసరిస్తూ వచ్చాడు. ముందస్తు పథకం ప్రకారం తాండవ నది గట్టుకు తీసుకెళ్లింది. జానకి తన బైక్ ఆపమని చెప్పి జీడి తోటలోకి తీసుకొని వెళ్ళి ఇరువురు కూర్చున్నారు. అదే సమయంలో ఆమె ప్రియుడు చింతల రాము పొదలలో నుంచి వచ్చి తన వెంట తెచ్చుకున్న సుత్తితో తల వెనుక భాగంలో బలంగా కొట్టాడు. దీంతో, అప్పల నాయుడు అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. ఈ నేరాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. పోలీసుల విచారణ ఆధారాలు లభించడంతో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణయ్య, రూరల్ ఎస్సై రామారావు, గోల్కొండ ఎస్సై నారాయణరావు పాల్గొన్నారు..


మాట్లాడుతున్న ఎఎస్‌పి అదిరాజ్‌సింగ్ రాణా


వినతి పత్రం అందిస్తున్న కుమార్

## ఓటర్ల పరిశీలనకు గడువు పొడిగించాలి

**ప్రజాశక్తి-మాడుగుల:** ఓట్ల పరిశీలన ప్రక్రియకు సమయం పొడిగించాలని టిడిపి నేత పివిజి కుమార్ కోరారు. బుదవారం తహసీల్దార్ రత్నంకు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో బి ఎల్ఓలు పూర్తి స్థాయిలో పరిశీలన చేయలేదని, క్షేత్ర స్థాయిలో పరిశీలన జరపలేదని వివరించారు. జీరో నంబర్‌తో 4,500 గృహాలు వున్నాయని వాటిని పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కసి రెడ్డి అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహం అడ్డగింత

### తల్లిదండ్రులకు కౌన్సెలింగ్


కౌన్సిలింగ్ ఇస్తున్న సిబ్బంది అధికారులు

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:** మున్సిపాలిటీలోని రెల్లి వీధికి చెందిన 17 సంవత్సరాల మంజేటి హిమ బాల్య వివాహాన్ని బుధవారం ఐసిడిఎస్ సిబ్బంది అడ్డుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు సిపిడిఓ సువార్త, ఎస్ఐ సుధాకర్, సూపర్వైజర్లు బాల్య వివాహం జరగకుండా అడ్డుకున్నారు. బాల్య వివాహంతో జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

### బాల్య వివాహాలపై ర్యాలీ

**ప్రజాశక్తి-గొలుగొండ:** బాల్య వివాహాలకు వ్యతిరేకంగా బుధవారం గొలుగొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ శ్రీగౌరీ మాట్లాడుతూ, ప్రజల సహకారం, మద్దతుతో మాత్రమే ఈ సామాజిక దురాచారాన్ని నిర్మూలించ వచ్చన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు అందిస్తున్న సహకారం కూడా ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సత్యవతి, అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

## జల జీవన్ మిషన్ పనులు ప్రారంభం

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలం పాతమల్లంపేట పంచాయతీ పోలవరం గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా ఏడు లక్షల 50వేలతో సోలార్ వాటర్ ట్యాంక్ పనులను బుధవారం సర్పంచ్ ఆదిలక్ష్మీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఈ పంచాయతీలో ఇప్పటికి రెండు గ్రామాల్లో జలజీవన్ మిషన్లు ప్రారంభం కాగా పోలవరం గ్రామంలో ప్రారంభంతో గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి పథకాలు సిద్ధమవతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.